www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 02 | మార్చి | 2026
పేజీలు : 8

అటల్ గొప్ప ప్రజాస్వామ్య వాది

-మాతృభాషలో మాట్లాడండి
-క్రమశిక్షణే ఉన్నతికి సోపానం
-మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

2లో..

ఆక్రమించింది ఎంత.. మట్టి తరలించిందెంత..?

భూదాన్ భూములపై వాస్తవాలు ఏమిటి..?

-పేదల పాలిట శాపమైన అధికారుల నిర్లక్ష్యం
-పేదలు ఆక్రమించింది ఆరు ఎకరాలే

ప్రజాపక్షం/ఖమ్మం :

ఖమ్మం భూదాన్ భూముల్లో ఏర్పాటు చేసుకున్న నివాసాల కూల్చివేత, పేదలను బయటకు పంపిన తీరు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాజకీయ దుమారాన్ని లేపింది. ఇదే సమయంలో పేదలను అక్కడి నుంచి బయటకు పంపి రూ.250 కోట్ల భూమిని స్వాధీన పర్చుకున్నట్లు అధికారులు ప్రకటించారు. అసలు పేదలు అక్రమించిన భూదాన్ భూమి ఎంత అన్నదే ఇప్పుడు అందరి మదిని తొలుస్తున్నది. కొందరు 60 ఎకరాలని, మరికొందరు 30 ఎకరాలని ఇష్టాను సారంగా ప్రచారం చేస్తున్నారు. చాలా మందికి స్పష్టత లేదు. అధికారులు మాత్రం పేదలను అక్కడి నుంచి బయటకు పంపడం ద్వారా రూ. 250 కోట్ల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 ఎకరాల భూదాన్ భూమి ఎటు వెళ్లిందని ఎవరు ఆక్రమించుకున్నారని ప్రశ్నిస్తున్నారు.

భూదాన్ భూ విస్తీర్ణం ఎంత...?

వినోబాబావే భూదానోద్యమం సందర్భంగా వెలుగుమట్ల రెవెన్యూలో సేకరించిన భూమి ఎంత అన్న దానిపై ఇప్పుడు చర్చ సాగుతుంది. సర్వే నెం. 147, 148, 149 లలో కలువల రాజారావుకు 60 ఎకరాల భూమి ఉంది. ఆయన 31.07 ఎకరాల

మిగతా 2లో..

మార్చి 15 నాటికి వెలుగుమట్ల పేదలకు నివాస స్థలాలు

ప్రజాపక్షం/ఖమ్మం : వెలుగుమట్ల భూ నిర్వాసితులలో అర్హులైన వారిని గుర్తించి మార్చి 15 నాటికి నివాస స్థలాలు కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లను కూడా మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

మిగతా 2లో..

-ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తాం
-పేదల వద్ద వసూలు చేసిన సొమ్మును రికవరీ చేస్తాం
-రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- మధుర బస్తీ ఇఫ్తార్ లో కూనంనేని
- కొత్తగూడెం అభివృద్ధిలో అంతా భాగస్వాములు కావాలి

2లో..

రెండు గదులు.. మూడు బడులు..!

-ఒక గది మూడు తరగతులు
-ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, విద్యార్థులు

2లో..

ఆక్రమించింది ఎంత.. మట్టి తరలించిందెంత..?

(మొదటిపేజీ తరువాయి)

భూమిని భూదాన్ ట్రస్ట్‌బోర్డుకు ఇచ్చారు. మిగిలిన 30 ఎకరాల భూమిని దుండేటి అప్పయ్య, మేకల అచ్చమ్మ, రావులపాటి నర్సమ్మ అనే వ్యక్తులకు విక్రయించారు. భూదాన్‌కు కేటాయించిన భూమి కూడా గొల్లగూడెం, రుద్రమ్మకోట, పుట్టకోట తదితర గ్రామాలకు చెందిన పేదలకు పంపిణీ చేశారు. అది మట్టి గుట్ట కావడంతో సాగుకు అనుకూలంగా లేకపోవడంతో భూ పంపిణీ చేసిన తర్వాత కూడా రైతులు ఆ వైపు చూడలేదు. వాస్తవానికి భూదానోద్యమం సందర్భంగా సేకరించిన భూమిని వెంటనే భూమి లేని పేదలకు పంపిణీ చేశారు అన్నది వాస్తవం. రైతులు సాగులోకి తీసుకురాకపోవడంతో 147,148, 149 లలో 31.07 ఎకరాలు భూదాన్ భూమి గానే కొనసాగుతుంది. 147లో రాష్ట్ర ప్రభుత్వం 10.20 ఎకరాలను 2008లో ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించింది. కొందరు జర్నలిస్టులకు కేటాయించడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో భూకేటాయింపు నిలిచిపోయింది. ఆ తర్వాత దానిని కస్తూర్బా విద్యాలయం, వీధి బాలల పాఠశాలకు కేటాయించారు. మిగిలిన 20 ఎకరాల భూమి అలాగే ఉంది. 2014లో అప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూదాన్ యజ్ఞ బోర్డును రద్దు చేసి భూదాన్ భూముల అనుభవదారులకు నోటీసులు ఇచ్చింది. ఖమ్మం లోని భూదాన్ భూమిలో ఎవరు అనుభవదారులు లేకపోవడంతో అది ప్రభుత్వ భూమిగా మారింది.

పేదలు ఆక్రమించింది ఎంత...?

ప్రభుత్వ సంస్థల కేటాయింపుకు పోను మిగిలిన భూమిలో వినోబానగర్ పేరుతో పేదలు ఆక్రమించింది ఎంత అన్న దానిపై ఎవరికి వారే లెక్కలు చెబుతున్నారు. సగానికి ఎక్కువ భూమి ఖాళీగా ఉంది. పేదలు ఆక్రమించింది ఆరు ఎకరాలకు అటు ఇటుగా ఉంటుంది తప్ప 20 ఎకరాల భూమిలో పేదలు లేరన్నది సత్యం.

మట్టి అమ్ముకున్న అక్రమార్కులు :

ఒక పక్క పేదలు తలదాచుకునేందుకు నివాస స్థలాలను ఏర్పాటు చేసుకుంటే మరో పక్క అక్రమార్కులు మట్టి అమ్మకాల ద్వారా కోట్ల రూపాయలు సంపాదించారు. ఇప్పుడు భూదాన్ భూమిగా చెప్పబడుతున్న దానిలో దాదాపు 100 అడుగుల మేర గుట్టను తవ్వి మట్టిని తరలించారు. మట్టిని తరలిస్తున్న సమయంలో ఏ అధికారి కూడా కన్నెత్తి చూడలేదు. మట్టి తరలింపుపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. పేదలు కష్టపడి గూడు నిర్మించుకుంటే ఆక్రమణల పేరుతో బయటకు నెట్టారు కానీ అక్రమార్కులపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకో లేదు.

అధికారుల నిర్లక్ష్యమే శాపమైంది...?

అధికారుల నిర్లక్ష్యమే పేదలు తీవ్రంగా నష్టపోయేందుకు కారణమైంది. 2014 నుంచి క్రమేపి భూదాన్ భూ ఆక్రమణ జరుగుతూ వచ్చింది. తొలుత స్థానికులు ఆక్రమణకు ముందుకు రాకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కొందరిని తెచ్చి భూ ఆక్రమణ చేశారు. అలా క్రమేపి భూ ఆక్రమణ విస్తరిస్తున్నప్పటికీ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. కొద్ది రోజులు గడిచిన తర్వాత అధికారులు పట్టించుకోరన్న దీమా మరో పక్క మనకు ఈ భూమిపై అధికారం వచ్చిందన్న కొందరి మాటలను నమ్మి స్థిర నివాసాలను ఏర్పరచుకు నేందుకు ప్రయత్నించారు. ఎవరి ఆర్థిక స్థితికి తగినట్లు వారు ఇండ్లను నిర్మించుకున్నారు. ఒక్కసారిగా ఇండ్లను యంత్రాలతో నేలమట్టం చేయడంతో పేదలు భారీగా నష్టపోయారు. పేదలను అక్కడే ఉంచి ప్రత్యామ్నాయం చూపి ఇండ్లను కూల్చి వేసే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఆ ప్రయత్నం చేయలేదు. స్థానికేతరులు భూ ఆక్రమణలో ఉంటే బయటకు పంపే అవకాశం ఉన్నప్పటికీ అది కూడా చేయలేదు. రకరకాల కారణాలతో తొలగింపు వాయిదా పడుతూ వచ్చింది. మొత్తంగా భూదాన్ భూముల ఆక్రమణ తొలగింపు నేపథ్యంలో నష్టపోయింది మాత్రం పేదలే.

రెండు గదులు.. మూడు బడులు..!

ప్రజాపక్షం/కూసుమంచి : విద్యార్థులు ఉన్న దగ్గర ఉపాధ్యాయులు ఉండరు. ఉపాధ్యాయులు ఉన్న దగ్గర విద్యార్థులు ఉండరు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉంటే ఆ పాఠశాలలో మౌలిక వసతులు ఉండవు. మొత్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారు, బోధించే వారు ఏదో ఒక ఇబ్బందిని ఎదుర్కొనక తప్పని స్థితి. ఇక నిరంతరం హడావుడి చేసే విద్యాశాఖాధికారులు మాత్రం ఇబ్బందులు ఉన్న వైపు తొంగిచూడరు. ఇక గిరిజన ప్రజలు ఉన్న చోట అందరి మాదిరే వివక్షను ప్రదర్శిస్తుంటారు. కూసుమంచి మండలంలో రెండు గదుల్లో మూడు పాఠశాలలు నిర్వహిస్తుండగా ఒక గదిలో మూడు తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి దాపురించింది. వివరాల్లోకి వెళితే... గైగొళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో చింతలతండా, హట్యాతండా గ్రామాలు ఉన్నాయి. హట్యాతండాలో ప్రాథమిక పాఠశాలకు రెండు గదులను కేటాయించారు. ఈ రెండు గదుల్లో ఒకటి నుంచి ఐదు తరగతులు బోధించాల్సి ఉండగా ఐదు తరగతులను కలిపి ఒకే గదికి పరిమితం చేశారు. రెండవ గదిలో అంగన్‌వాడీ పాఠశాలను నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ పాఠశాల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. అదే గదిలో చింతలతండా అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా అదే గదిలో నిర్వహించడం శోచనీయం. చింతలతండా ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో మూడు తరగతులను నిర్వహిస్తున్నారు. మూడు తరగతులకు విద్యాబోధన జరుగుతుంటే విద్యార్థులకు ఏమేరకు అర్థమవుతుందో ఆలోచించాల్సిన బాధ్యత విద్యాశాఖాధికారులపై ఉంది. హట్యాతండా, చింతలతండాలు పూర్తిగా గిరిజన గ్రామాలు. ఇక్కడ కనీస వసతులు కల్పించాల్సిన అధికార యంత్రాంగం కనీసం పట్టించుకోవడం లేదు. ఇదే మండల పరిధిలోని నేలపట్ల, నర్సింహులగూడెం పాఠశాలల్లోనూ నెలకొన్నది. గదుల నిర్మాణం పూర్తయినప్పటికీ పాఠశాలకు అప్పగించకపోవడంతో విద్యార్థులు కూర్చునేందుకు ఇబ్బందికరంగా మారింది. గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ పాఠశాలల పట్ల దృష్టిసారించి తరగతి గదుల నిర్మాణం త్వరితగతిన చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

ప్రజాపక్షం/ కొత్తగూడెం : ఇఫ్తార్ విందు మత సామరస్యానికి, సోదరభావానికి నిలువుటద్దంగా ఉంటుందని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం మధుర బస్తీలో జమాతే ఇస్లామి హింద్ కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఇఫ్తార్ విందును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. తమ సామరస్యానికి ప్రతీకగా రంజాను నిలుస్తుందని, అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, జమాతే ఇస్లామీ హింద్ నాయకులు, మైనార్టీ నాయకులు, సంఘాలు, ప్రతినిధులు జహంగీర్, నయూమ్ ఖురేషీ, అబిద్ హుస్సేన్ దస్తగిరి తాజుద్దీన్ తో పాటు ప్రముఖ నాయకులు ఎర్ర లింగేశ్వర్, మద్దెల శివ కుమార్, జర్పుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అటల్ గొప్ప ప్రజాస్వామ్య వాది

ప్రజాపక్షం/ ఖమ్మం : మాజీ ప్రధాని వాజ్‌పేయి ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని అతి గొప్ప ప్రజాస్వామ్యవాది, దేశభక్తుడు, కవి, రచయిత అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు తెలిపారు. అణు పరీక్షలను నిర్వహించిన ధీశాలి అన్నారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన వాజ్‌పేయి శత జయంతి పుస్తకావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ పదవుల కోసం వాజ్‌పేయి ఎప్పుడు రాజీ పడలేదని ఓటమిని సైతం హుందాగా స్వీకరించిన ధీశాలి అన్నారు. స్వచ్ఛమైన మనస్సుతో దేశసేవ చేయాలని ఆకాంక్షించిన వాజ్‌పేయి స్వర్ణ చతుర్భుజి రహదారుల నిర్మాణాన్ని సమాచార ప్రచార రంగంలో గొప్ప మార్పుకు నాంది పలికారన్నారు. ప్రపంచ దేశాల ఆంక్షలను లెక్కచేయకుండా ప్రోక్రాన్ అణు పరీక్షలను నిర్వహించి ప్రజల ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించారన్నారు. శ్యాంప్రకాష్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా వాజ్‌పేయి పని చేశారని ఆయన పాలన దక్షిత, నిస్వార్థ సేవ నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. రాజకీయ పార్టీలకు గతంలో ఒక నిర్దిష్ట విధానం, సిద్దాంతం ఉండేదని ఇప్పుడు సిద్దాంతాలకు తిలోదకాలు ఇచ్చారన్నారు. అవకాశవాదంతో పార్టీలు మారుతున్నారని కులం కంటే గుణం మిన్న అన్న విషయాన్ని ఇప్పటి నేతలు గుర్తించాలన్నారు. కులం, మతం, ధనం, నేర చరిత్ర కాకుండా వ్యక్తిత్వం, సామర్థ్యం, యోగ్యత, ప్రవర్తన చూసి ఓట్లు వేయాలని ప్రజలకు వెంకయ్య నాయుడు సూచించారు. వివాదాలకు ఇచ్చిన ప్రాధాన్యత మీడియా మేలు చేసే అంశాలకు ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విలువలతో కూడిన రాజకీయాలే సమాజ ఉన్నతికి దోహదపడతాయన్నారు. మాతృభాషలో మాట్లాడటమే సరైనదని పర భాష పదంతో అమ్మను పిలవడం సరైంది కాదన్నారు. అమ్మ, నాన్న అని పిలవడంలో ఉన్న కమ్మదనం ఆంగ్ల పదాల్లో లేదని ఆయన తెలిపారు. హిందూత్వం అంటే ఒక ఇరుకైన మతం కాదని విశాలమైన సంస్కృతి అన్నారు. క్రమశిక్షణ కారణంగానే తాను రైతు కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగానని, వ్యవస్థ అందించిన ప్రోత్సాహం కూడా మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుద్దుకూరి వెంకటేశ్వరరావు, మందడపు ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, కసిరెడ్డి వెంకటాప్పారెడ్డి, కామినేని శ్రీనివాస్, దేవకి భాస్కర్‌రావు, ఎన్. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 15 నాటికి వెలుగుమట్ల పేదలకు నివాస స్థలాలు

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వెలుగుమట్ల భూ నిర్వాసితుల సర్వే పూర్తయిందని 747 మందిని గుర్తించడం జరిగిందని వీరిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు గతంలో లబ్ది పొందిన వారు ఉన్నారని ఆయన తెలిపారు. ఖమ్మం పరిసర ప్రాంతాలకు సంబంధించిన వారితో పాటు పరిసర నియోజక వర్గాలకు చెందిన వారు ఉన్నారు. ఈ ప్రభుత్వం ఏ పేద వానికి అన్యాయం చేయదని ఆయన స్పష్టం చేశారు. వెలుగుమట్ల ఘటనలో అధికారులు తప్పు చేస్తే తప్పక శిక్షిస్తామని పేద వారికి మాత్రం ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం చేయమన్నారు. వెలుగుమట్ల తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వభూముల్లో పేద ప్రజలు నివాసం ఉంటే అర్హులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పేదవాని విషయంలో రాజకీయాలు తగవని ఆయన విపక్షాలకు హితవు పలికారు. కొంత మంది అసత్య ప్రచారాలు చేస్తున్నారని ముఖ్యంగా మంత్రులు ఈ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు అర్థరహితమని ఆయన తెలిపారు. రాజకీయ లబ్ది కోసం మాత్రమే ఆరోపణలు చేస్తున్నారని పేదవారిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం తగదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కేటాయించిన తర్వాత త్రాగునీరు, విద్యుత్, అంగన్ వాడీ తదితర మౌలిక వసతులు కల్పించడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తామన్నారు. పేదల వద్ద నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేశారని ఆ డబ్బును రికవరీ చేసి పేదలకే అప్పగిస్తామని పొంగులేటి హామీ ఇచ్చారు. ఈ ప్రభుత్వం పేదల కోసమే ఉన్నదని ఎట్టి పరిస్థితుల్లోనూ పేదలకు అన్యాయం జరగనివ్వరాదని ముఖ్యమంత్రి ఆదేశించారని ఆ ఆదేశాలకు అనుగుణంగానే ఈ ప్రభుత్వం నడుచుకుంటుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక తీరుగా లేనప్పుడు మరో తీరుగా వ్యవహరించ లేమన్నారు. కొన్ని ప్రతిపక్ష పార్టీలు శవాల మీద చిల్లర ఏరుకునే చందంగా వ్యవహరిస్తున్నాయని కొన్ని పత్రికలు ఇష్టానుసారంగా రాశాయని ఆయన తెలిపారు. తప్పు జరిగితే శిక్ష తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, అడిషనల్ కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీ అభివృద్ధే నా ధ్యేయం

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతా
మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్



ప్రజాపక్షం/వైరాః వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు సోమవరం నల్లచెరువు లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇందిరమ్మ కాలనీపై నూతనంగా మున్సిపాల్ వైస్ చైర్మన్ ఆ వార్డు కౌన్సిలర్ కట్ల సంతోస్ ప్రత్యేక దృష్టి సారించాడు. ఈ సందర్భంగా కట్ల సంతోష్ ప్రజాపక్షంతో మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో ఉండే నిరుపేదలకు అండగా ఉంటాను, ఎన్నో సంవత్సరాల నుండి ఉన్న ఆ కాలనీ సమస్యలను పరిష్కరిస్తాను, వర్షాలు వస్తే నల్ల చెరువు నుండి వచ్చే వరదతో జలయమంగా మారిపోతుంది. ఆ సమస్యను పూర్తిస్థాయిలో తీర్చేందుకు వరద నుండి కాలనీని కాపాడేందుకు రిటైనింగ్ వాల్ కోసం కృషి చేస్తాను, ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో ఇందిరమ్మ కాలనీ వరద ముంపుకి గురికాకుండా రిటైనింగ్ వాల్‌లను ఏర్పాటు చేయడం కోసం నిరంతరం శ్రమిస్తాను, ముఖ్యంగా ఆ కాలనీ ప్రజల సౌకర్యం కోసం కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తాను, కాలనీఓల పూర్తిస్థాయిలో డ్రైనేజీలు, సిసి రోడ్లు నిర్మాణం చేస్తాను, ఈ ప్రాంతంలో ఉన్న పిల్లలు విద్య వైపు మళ్లించే విధంగా విద్యాశాఖ అధికారులతో, ఇతర శాఖల అధికారులతో మాట్లాడి పిల్లలను చదివించే విధంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేపించి పిల్లలను పాఠశాలకు పంపించే విధంగా కృషి చేయడం జరుగుతుంది. కాలనీలో పూర్తిస్థాయిలో విద్యుత్ స్థంభాలు ఏర్పాపు చేయడం, ప్రమాదకంరగా ఉన్న స్థంభాలను సరిచేయడం కరెంటు లైన్‌లు సరిచేయడం చేపించడం జరుగుతుంది. ఎందుకంటే చాలా ప్రమాదకరంగా విద్యుత్‌లైన్‌లు కాలనీలో ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీ ప్రక్కన ఉన్న వైరా రిజర్వాయర్ కాల్వకు కాలనీ వరకు పిల్లలు కాల్వ వైపు వెళ్లి ప్రమాదాలు గురికాకుండా జాలి ఏర్పాటుకు ప్రతిపాదనలను సైతం పంపించడం జరుగుతుంది. ఎన్నికల సమయంలో కాలనీ అభివృద్ధికి ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తాను, నేను రాజకీయాల్లోకి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించి సేవ చేయడానికి వచ్చాను, నా తల్లిదండ్రుల నుంచి నేర్చుకున్న ప్రతి విషయాన్ని ప్రజాసేవకు అంకితం చేస్తాను. ఇందిరమ్మ కాలనీ వద్ద బస్ షెల్టర్ నిర్మాణానికి కృషి చేస్తాను, ఒక మోడల్ కాలనీగా ప్రజలు మనల్ని పొందేవిధంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో ప్రతి సమస్యను ఆ ప్రాంత ప్రజలకు పరిష్కరించి తీరుతాను.

నేడు శ్రీ చెన్నకేశవస్వామి కళ్యాణం

ప్రజాపక్షం/చింతకాని : చింతకాని శ్రీ భూనీళా సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారి కళ్యాణం సోమవారం అంగరంగ వైభంగా జరగనుంది. ఇప్పటికే ఆలయ ఉత్సవ కమిటీ కళ్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆలయంలో పాంచరాత్ర ఆగమన పద్ధతిలో శ్రీ శేషబట్టర్ రఘునాధా చార్యులు వారి ఆధ్వర్యంలో బ్రహోత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి జరిగే కళ్యాణానికి చింతకాని మండలంతో పాటు చుట్టు ప్రక్కన మండల ప్రజలు భారీగా తరలిరానున్నారు. సోమవారం న సుప్రభాత సేవ, ఆరాధన సేవాకాలం చతుస్థాన అర్చనలు, మూల మంత్ర హోమం బలిహారణం, ఎదుర్కోలు రాత్రి 8గంటలకు శ్రీ భూనీళాసమేత శ్రీ చెన్నకేశవస్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ యండపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

భక్తి భావం చాటిన కొమ్మిని రామారావు...

గతంలో పాలకమండలి సభ్యులు ముందు చూపుతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అట్టి పొలాల రైతులకు యాసంగి కౌలు చెల్లించి ఆ ప్రదేశంలో బ్రహోత్సవాల సమయంలో కార్యక్రమాలు నిర్వహించేవారు. ఈ ఏడాది అట్టి విషయాన్ని ఎవరూఐ పట్టించుకోకపోవడంతో రైతులు తమ పొలాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఈ ఏడాది కార్యక్రమాలు నిర్వహించడానికి స్థలం లేక ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడింది. దీంతో దేవస్థాన కమిటీ సభ్యులు కొమ్మిని రామారావు భక్తి అంటే పూజలు చేయడం కాదు పదిమందికి ఉపయోగపడే కార్యక్రమం చేయడమే గొప్ప అని నిరూపించుకున్నాడు. తను కౌలుకు సాగు చేసే మొక్కజొన్న ప్రస్తుతం చేతి కొచ్చే దశలో ఉంది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండాలని శనివారం రాత్రి తన మొక్కజొన్న పంటను పూర్తిగా దున్ని భూమిని చదును చేసి తన దాత్రుత్వం చాటుకున్నాడు. ఇలాంటి భక్తిభావం సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించడమే కాకుండా సంస్కృతి సంప్రదాయాలను నిలబెట్టే గొప్ప విషయమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాగులవంచలో రెండు ట్రాక్టర్లు ఢీ.. డ్రైవర్ మృతి

ప్రజాపక్షం/చింతకాని : చింతకాని మండలం నాగులవంచ వద్ద ఆదివారం తెల్లవారు జామున రెండు ఇసుక ట్రాక్టర్లు ఢీకొన్న ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోనకల్ మండలం గార్లపాడు కు చెందిన శ్రీరామ నాగయ్య(19) బోనకల్లు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. బోనకల్ మండలం ఆళ్ళపాడు గ్రామానికి చెందిన బుంగా రాంబాబు అనే వ్యక్తి నాగయ్య కు ఫోన్ చేసి తన ట్రాక్టర్ కు డ్రైవర్‌గా రావాలని కోరాడు. దీంతో నాగయ్య శనివారం రాత్రి ముదిగొండ మండలం గంధసిరి మున్నేరు వద్దకు వెళ్లి ఇసుక నింపుకొని నాగువంచ రైల్వే కాలనీకి బయలు దేరాడు. ఈ క్రమంలో నాగులవంచ వద్ద ఆర్ అండ్ రోడ్డు పై అదే దారిలో వెళ్తున్న చిన్నమండవకు చెందిన మరో ట్రాక్టర్‌ను ఓవర్ చేయబోయాడు. చిన్నమండవ కు చెందిన ట్రాక్టర్ నాగయ్య నడుపుతున్న ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టడంతో రెండు ట్రాక్టర్లు రోడ్డు పక్కన బోల్తా పడి ఇసుక కుప్ప నాగయ్యపై పడటంతో నాగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై వీరేందర్ సంఘటనా స్థలానికి చేరుకొని జేసీబీ సాయంతో ట్రాక్టర్లను తొలగించి మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్ట్ మార్టం నిమిత్తం నాగయ్య మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.తమ కుమారుడు మృతికి మరో డ్రైవర్ కాశిమాల రాజ్‌కుమార్ నిర్లక్ష్యమే కారణమని మృతుడి తల్లి పుల్లమ్మ ఇచ్చిన ఫిర్యాధు మేరకు ఎస్సై వీరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

టాలెంట్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

ప్రజాపక్షం/సత్తుపల్లిః 13వ ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్షిప్ 2026 పోటీలలో స్థానిక సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థి ధారవత్ హర్షిత్ కట 6వ విభాగంలో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రథమ స్థానం సాధించడం పట్ల టాలెంట్ స్కూల్ కరెస్పాండెంట్ పులి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ముందు ముందు మరిన్ని విజయాలు సాధించాలని, హర్షిత్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూల్ యాజమాన్యం, కరాటే మాస్టర్స్, విద్యార్థి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ ఫణితి సైదులుకి సన్మానం

ప్రజాపక్షం/వైరాః వైరా మున్సిపాల్ 7వ వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులుని బ్రాహ్మణపల్లి ఆర్ సిఎం చర్చి సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆర్‌సిఎం చర్చిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో కౌన్సిలర్ ఫణితి సైదులుని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌సిఎం ర్చి సభ్యులు మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరి అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. భవిష్యత్తులో వార్డు అభివృద్ధికి ఆయన మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఫణితి సైదులు మాట్లాడుతూ ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నేను వమ్ము చేయను, వార్డులో సమస్యలను, వార్డు అభివృద్ధికి నేను కృషి చేస్తానని అందరికి అండదండగా ఉంటానని, భవిష్యత్తులో వార్డు డవలప్‌మెంట్ చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిఎం చర్చి సంఘ పెద్దలు కుమారి, భాస్కర్, జెస్సికా, వాటర్ సర్వీసింగ్ సెంటర్ ప్రొప్రైటర్ ఫణితి గిరి, ఫణితి వెంకటేశ్వర్లు, కాసిమల్ల జ్యోతిబస్, కాంద్ర వెంకన్న, సుధాకర్, కాంద్ర శ్రీను, నాగార్జున, భూషణం, దారా ప్రభాకర్, ప్రసాద్, కాంద్ర రవి, కుటుంబరావు, మేకల కిరణ్, మనీ, బీరెల్లి అప్పారావు, కాంతయ్య, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కు సన్మానం

ప్రజాపక్షం/వైరాః వైరా మండలం కుమ్మరిశాలి వాహన ప్రజాపతి(కెఎస్‌పి) సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన వైరా మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ, మురళీకృష్ణని, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల వెంకటనారాయణ, విలాసాగరం వెంకటేశ్వర్లు, ఎల్ఐసి వెంకటేశ్వరరావు, దరిపల్లి శ్రీఇనవాసరావు, ఇనగంటి ప్రసాద్, గుడిమెట్ల రవి, విలాసాగరం నరేష్, దరిపల్లి మధు, కొత్తపల్లి నవీన్, కొత్తపల్లి సత్యనారాయణ, వెలిశాల కరీం, వేణు తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తాం

ప్రజాపక్షం/వైరాః వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు దిద్దిపూడిలో ఆదివారం వార్డుకు చెందిన పొన్నం వెంకటేశ్వరరావు నివాసం నందు జరిగిన ఉప్పలమ్మ దైవ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కాపా మురళీకృష్ణ గుడి వద్ద 15వ వార్డు కౌన్సిలర్ నల్లమోతు శైలజ సురేష్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్డులో సమస్యల పరిష్కారానికి నిరంతరం మున్సిపాల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ కృషి చేస్తానని వార్డు కౌన్సిలర్ నల్లమోతు శైలజ సురేష్‌కు ఎప్పుడు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలోపలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

కాపా చంద్రకళ దంపతులు ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/వైరాః వైరా మండలం గొల్లపూడి గ్రామ సమీపంలో ఉన్న పులిగొండ లక్ష్మీ నరసింహాస్వామి ఆలయంలో వైరా మున్సిపాలిటీ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పులిగుట్ట వద్దకు వచ్చిన వైరా మున్సిపాల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ దంపతులను గొల్లపూడి సర్పంచ్ మేడూరి రామారావు లీల స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం సర్పంచ్ భూక్యా బాలాజి, మాజీ దేవాలయ చైర్మన్ శేఖమూరి లోకేశ్వరరావు, అభయాంజనేయ స్వామి గుడి చైర్మన్ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, షేక్ సైదా , మిట్టపల్లి సతీష్, మేడూరి శ్రీనివాసరావు, భజన మండలి బాధ్యులు తబలా కృష్ణ, గుడిపాటి సూర్యం, లగడపాటి ప్రభాకర్ రావు, లగడపాటి లక్ష్మీ రాజ్యం, కల్పన, కృష్ణకుమారి, కల్పనా, రఘు, డాక్టర్ కోట అవినాష్, శ్రీచరిత, డాక్టర్ నాగ మేఘన తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

ప్రజాపక్షం/ కొత్తగూడెం : ఐడిఓసిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ అంకిత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖిత పూర్వక ఫిర్యాదులు సమర్పించాలని సూచించారు. ఉ 10.30 గం.లకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు. అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అదే విధంగా ఐటిడిఏలో గిరిజన దర్బారు నిర్వహించనున్నట్లు పిఓ రాహుల్ తెలిపారు. భద్రాచలం తహశిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తామని తహసిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు చెప్పారు.

ఘనంగా మాదిగ అమరవీరుల సంస్కరణ దినోత్సవం

ప్రజాపక్షం/మణుగూరుః మణుగూరు మండలం బాపనకుంటలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్కరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము హుస్సేన్ మాదిగ, చిట్యాల రజిత మాదిగ, ఉసీల కొండయ్య మాదిగ, చెక్క రమేష్ మాదిగ, గంగపురి మోహన్ రావు మాదిగ, తెలే కృష్ణ మాదిగ, జింక శీను మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ నాయకులు పులి కృష్ణకు నివాళి

ప్రజాపక్షం/మణుగూరుః సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సింగరేణి ఉద్యోగి, కల్లు గీత కార్మిక సంఘం మండల నాయకులు, శివలింగాపురం గ్రామవాసి పులి కృష్ణ దిన కర్మలు ఆదివారం ఆయన స్వగృహంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య, ఏఐటియుసి కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, కార్యవర్గ సభ్యులు నోముల రవి తదితరులు హాజరై పులి కృష్ణ చిత్ర పటం కు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన పాయం

ప్రజాపక్షం/మణుగూరుః మణుగూరు మండలం గుట్ట మల్లారంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో పునాటి నారాయణ సుభద్ర దంపతుల కుమారుడు పూర్ణచందర్రావు కీర్తిల వివాహ వేడుక ఘనంగా నిర్వహించబడింది. ఈ శుభవివాహ వేడుకకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలియజేసి వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖ సంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, సమితి సింగారం ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, సీనియర్ నాయకులు పోలమూరి రాజు, లక్ష్మణ్ , ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి అండగా..

ప్రజాపక్షం/సత్తుపల్లిః పదో తరగతిలో కలిసి చదువుకున్న ఆ మిత్రుల బంధం 25 సంవత్సరాలు దాటినా చెక్కుచెదరలేదు. ఒక మిత్రుడికి కష్టం వస్తే మేమంతా ఉన్నామంటూ కదిలివచ్చారు. వేంసూరు ఉన్నత పాఠశాలలో 2001 02 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. వేంసూరు పాఠశాలలో తమతో పాటు చదువుకున్న వేంసూరు గ్రామానికి చెందిన కొమ్మినపల్లి నాగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటిలో నడవలేని స్థితిలో కాలం వెళ్ళదీస్తున్నాడు. దానికి తోడు కుటుంబ ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా ఉంది.. విషయం తెలుసుకున్న ఆనాటి పదవ తరగతి చదివిన విద్యార్థులు నాగరాజుకు చేదోడువాదోడుగా నిలవాలని, స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ క్లాస్మేట్స్ అందరూ కలిసి 50,000 సేకరించి ఆదివారం వేంసూరులోని నాగరాజు ఇంటికి వెళ్లి ఆనాటి చదువు చెప్పిన గురువైన లక్ష్మయ్య బాబు చేతుల మీదుగా నగదును అందజేశారు. కష్టకాలంలో నాగరాజు కు అండగా నిలిచిన మిత్రులందరినీ స్థానికులు, పాఠశాల పూర్వ విద్యార్థులు అభినందించారు.

ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రూ.10.70 కోట్లతో 30 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన

ప్రజాపక్షం/చర్ల : ఏజెన్సీప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం చర్ల మండల కేంద్రంలో రూ.10.70 కోట్లతో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఎంపి పోరిక బలరామ్ నాయక్, ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ పిఓ రాహుల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. టిజిఎంఎస్ఐడిసి నిధులతో అత్యాధునిక ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. శంకుస్థాపన అనంతరం ఆస్పత్రిలో అంకితభావంతో పనిచేస్తున్న వైద్యులను, సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అందిస్తున్న నిస్వార్థ సేవలను కొనియాడుతూ వారికి ప్రభుత్వం తరపున ప్రశంసా పత్రాలను అందజేశారు. చర్ల మండలంలో మారుమూల ప్రజలకు మెరుగైన వైద్యం అందివ్వాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఆస్పత్రి అభివృద్ధికి రానున్న రోజుల్లో అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తామని చెప్పారు. ఆస్పత్రికి వచ్చే నిరుపేద రోగులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ప్రైవేటు ఆస్పత్రులకు ధీటుగా మంచి వైద్యాన్ని అందించాలని మంత్రి సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఏజెన్సి ప్రజల ఆరోగ్య అవసరాలు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆస్పత్రిని మంజూరు చేసిందన్నారు. భవన నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని, ఏజెన్సీ ప్రజల ఆరోగ్యానికి పెద్దపీఠ వేస్తున్నామని, ఇక్కడే అధునాతన వైద్యసేవలు అందివ్వడం ద్వారా ఏజెన్సీ ప్రజలకుపెద్ద ఊరట లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ రవిబాబు, చర్ల సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, అన్నిశాఖల అధికారులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో సత్తుపల్లి పోలీసుల సత్తా

ప్రజాపక్షం/సత్తుపల్లిః రాష్ట్ర రాజధానిలోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన నాలుగవ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడోత్సవంలో భాగంగా 15వ బెటాలియన్ సత్తుపల్లి పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా తమ ప్రతిభను చాటి సత్తుపల్లి కీర్తిని మరింతగా ఇనుమడింపజేశారు. ఇటీవల ముగిసిన ఈ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో సత్తుపల్లి 15వబెటాలియన్‌కు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది అనేక పతకాలను సాధించి తమ ప్రతిభను నిరూపించారు. ఆదివారం బెటాలియన్ లో జరిగిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బందికి పథకాలను అందజేశారు. అసిస్టెంట్ కమాండెంట్ శ్రీధర్ రాజా టెన్నిస్, ఆర్చరీ విభాగాలలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించి విశేష ప్రతిభ కనబర్చారు. కబడ్డీ క్రీడలోఏఎస్ఐ నరసింహారావు, హెడ్ కానిస్టేబుల్స్ ఎ. సురేష్, చిన్నేష్ లు రజత పతకాన్ని సాధించారు.

టగ్ ఆఫ్ వార్ క్రీడలో....

హెడ్ కానిస్టేబుల్ యస్. పెద్దులు, కానిస్టేబుల్ హుస్సేన్ లు బంగారు పతకాన్ని సాధించారు.

ఖో ఖో క్రీడలో..

కానిస్టేబుల్స్ సి.హెచ్. నరేష్, హర్షిత్ లు బంగారు పతకాన్ని సాధించారు.

హ్యాండ్ బాల్ క్రీడలో..

కానిస్టేబుల్స్ కె. రఘు, రమేష్ లు కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 15వ బెటాలియన్ పోలీసు క్రీడాకారులను తెలంగాణ స్పెషల్ పోలీసు ఏడీజీపీ సంజయ్ కుమార్ జైన్ (ఐపిఎస్) అభినందించి ప్రోత్సహించారు. అదేవిధంగా, కమాండెంట్ ఏ. అంజయ్య క్రీడాకారులను అభినందిస్తూ, వారి కృషి, పట్టుదల, అంకితభావం ఇతర సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గెలుపోటములు సహజమని, విజేతలు జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని, ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా తమ లోపాలను సరిదిద్దుకొని ముందుకు సాగాలని సూచించారు. సత్తుపల్లి 15వబెటాలియన్‌కు పతకాలు తీసుకువచ్చిన క్రీడాకారులందరినీ ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

42 శాతం రిజర్వేషన్ డిమాండ్ న్యాయమైనదే..

-బిసి సదస్సులో కోదండరాం

ప్రజాపక్షం / ఖమ్మం : బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు డిమాండ్ న్యాయమైనదేనని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రో॥ కోదండరాం తెలిపారు. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడం ద్వారా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదుగుతారని ఆయన తెలిపారు. తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో ఖమ్మంలోని టిటిడిసి భవనంలో ఆదివారం బిసి సదస్సు నిర్వహించారు. సదస్సులో కోదండరాం మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతిపాదించినటువంటి ప్రజాస్వామ్యం, ప్రాతినిథ్య ప్రజాస్వామ్యం కానీ మెజార్టీ వర్గాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో పాతుకుపోయిన కారణంగా అసమానతలు పెరుగుతున్నాయన్నారు. న్యాయ సమ్మతమైన ప్రాతినిథ్యాన్ని బిసి వర్గాలు పొందలేకపోయాయని కోదండరాం తెలిపారు. అన్యాయాన్ని సరిదిద్దే బాధ్యతను రాజ్యాంగం పాలకులకు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్‌ను తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని కోదండరాం డిమాండ్ చేశారు. బిసి సదస్సు అనంతరం కోదండరాం భూదాన్ భూ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూదాన్ బాధితులకు సమాచారం ఇవ్వకుండా ఖాళీ చేయించడం సరైంది కాదని ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని కోదండరాం హామీ ఇచ్చారు. బాధితులను కలుపుకుని ముఖ్యమంత్రికి ఒక మెమోరాండం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జన సమితి నాయకులు షేక్ సర్దార్ హుస్సేన్, రవి, టిఎన్‌జీవో జిల్లా మాజీ అధ్యక్షులు కూరపాటి రంగరాజు, నాయకులు చిర్రా రవి, నూనె భాస్కర్‌రావు, స్వర్ణకుమార్, మహబూబ్ పాషా, పమ్మి రవి, నజీమా తదితరులు పాల్గొన్నారు.

రైతు పండించిన పంట రైతుకే..

- ఎంఎల్ఏ మాళోత్ రాందాస్‌నాయక్

ప్రజాపక్షం/కారేపల్లి: సీతారామ ప్రాజెక్ట్ భూముల్లో సుబాబుల్ పంటను రైతులే కొట్టుకుంటామని ఎంఎల్ఏ మాళోత్ రాందాస్ నాయక్‌కు చీమలపాడు సర్పంచ్ మాలోత్ లలిత భావుసింగ్ విన్నవించుకున్నారు. ఆదివారం వైరా ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఏ రాందాస్ నాయక్‌ని కలిసి రైతులు పండించిన పంటను రైతులే కొట్టుకునే విధంగా అధికారులను ఆదేశించాలని రైతులతో కలిసి తమ ఆవేదనను తెలియజేశారు. ఎంఎల్ఏ వెంటనే స్పందించి ఇరిగేషన్ అధికారులను పిలిపించి సమస్య తెలుసుకొని కలెక్టర్‌తో సంప్రదించి సమస్యను పరిష్కరిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అలాగే సామరస్యంగా కాల్వ పనులు అడ్డుకోకుండా రైతులు కూడా సహకరించాలని ఎంఎల్ఏ రైతులకు వివరించారు. రైతులు ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి పండించిన పంటను రైతులే తీసుకునే విధంగా రైతుల పక్షాన నిలబడి రైతులకు సహాయం చేయాలని అధికారులకు సూచించారు. రైతు లేనిదే మనము లేమని సుబాబులను పంటను డబ్బుల కోణంలో కాకుండా రైతులు పండించే పంట కోణంలో చూడాలని అధికారులకు సూచించారు. ఇట్టి విషయంలో ఇరిగేషన్ అధికారులు మేము డబ్బులు ఇచ్చాము సుబాబులను మేమే నరుకుంటామని అధికారులు ఎంఎల్ దృష్టికి తీసుకువచ్చారు. వాస్తవానికి నష్టపరిహారం కింద ఇచ్చిన రూ 1,38,000 నామమాత్రమే, ఇది పెట్టుబడికి మాత్రమే సరిపోతుందని, సుబాబులు పంట దీర్ఘకాలిక పంట, దీని విలువ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఒక ఎకరానికి రెండు లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతులు వివరించారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానే ఇరువర్గాలతో మాట్లాడి రైతులకు హామీ ఇవ్వడం జరిగింది. రైతులే నేరుగా సుబాబులు పంట కొట్టుకునే విధంగా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని రైతులకు హామీ ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎంఎల్ఏను కలిసిన వారిలో బచ్చలి వెంకటేశ్వర్లు, మాలోత్ స్వామి, గుజ్జర్లపూడి సైదులు, పాటి రాంబాబు, పాటి రామయ్య, గుజ్జర్లపూడి జాను, పాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాలకోయ తండాలో భూ తగాదా

- నోటీసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్న రియల్టర్
- పట్టించుకోని పోలీసులు

ప్రజాపక్షం/పాల్వంచ : ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కుటుంబానికి, గిరిజన కుటుంబాలకు నడుము జరిగిన భూ వివాదంలో స్టేషన్‌కు చేరుకున్న ఇరు వర్గాలను సమానంగా చూస్తూ తగు విచారణ చేసి న్యాయం చేయాల్సిన పోలీసులు ఒకరికి రాచమర్యాదలు ఇస్తూ, మరొకరి పట్ల చీత్కారాలతో పట్టించుకోవటంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పాలకోయతండాలో జరిగిన భూతగాదాతో ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్‌కు చేరుకొన్నాయి. స్థానిక నవభారత్ దేవస్థానం ఎదురుగా ఉన్న 444 సర్వేలో పాలకోయతండాలో సుమారు నాలుగు ఎకరాలలో 40 కుటుంబాలకు చెందిన గిరిజనులు గత 80 సంవత్సరాలుగా నివసిస్తున్నారు. గత కొంత కాలంగా ఓరియల్ ఎస్టేట్ వ్యాపారి కుటుంబం ఈ భూమి తమదేనంటూ భూమి పైకి వస్తున్నారు. గ్రామానికి ప్రభుత్వం నుండి మంజూరైన నాలుగు అంతర్గ రహదారుల నిర్మాణాన్ని సైతం అడ్డుకొన్నారు. ఈ స్థలం తమదేనంటూ గిరిజన కుటుంబాలను తక్షణమే ఇండ్లు ఖాళీ చేయాలంటూ లాయర్ ద్వారా నోటీసులు పంపించారు. ఫిబ్రవరి 28వ, తేదీన రియల్ వ్యాపారికి చెందిన ఇద్దరు కుమారులు రెండ్లు కార్లు, రెండు ఆటోలలో మరో పది మంది రౌడీ షీటర్లతో వచ్చారు. వచ్చి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ భూమి మాదంటూ వెంటనే వెళ్ళిపోవాలన్నారు. ఇష్టం వచ్చిట్లున బూతులు తిడుతూ గ్రామంలో భయానక వాతావరణం సృష్టించారు. గిరిజనులు ఎదురు తిరిగారు. దీనితో రియల్ వ్యాపారి కొడుకులైన ఇద్దరు తమ సెల్ ఫోన్‌లలో మహిళలను చిత్రీకరిస్తూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. కోపోద్రిక్తులైన గిరిజన మహిళలు వారితో వాగ్వాదానికి దిగారు. మాటా మాటా పెరిగి తగాదా ముదిరింది. తమను వివిధ కోణాల్లో ఫోటోలు తీస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. అయినా వినిపించుకోకుండా మీకు దిక్కున్న చోట చెప్పుకోండంటూ మరింత రెచ్చిపోయారు. దీనితో మహిళలు వారిపై చేయి చేసుకొన్నారు. అనంతరం గిరిజనులపై రియల్ వ్యాపారి కుటుంబం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల సూచనతో గిరిజనులు స్టేషన్ చేరుకొన్నారు. అనంతరం రియల్ వ్యాపారి నూతలపాటి మురళీధర్‌రావు, అతని కుమారులు రామక్రిష్ణ, శివక్రిష్ణలపై గిరిజనలు ఫిర్యాదు చేశారు. కాగా గిరిజన మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంపన్న వర్గాలకు స్టేషన్‌లో రాచమర్యాదలను ఇస్తూ మేము ఇచ్చిన ఫిర్యాదును పట్టించుకోవటం లేదనే గిరిజన మహిళలు ఆరోపిస్తున్నారు. కాగా ఇదే గ్రామానికి ప్రభుత్వం నుండి మంజూరైన నాలుగు అంతర్గ రహదారుల నిర్మాణ సమయంలో గుత్తేదారుడిని సైతం బెదిరించి రోడ్ నిర్మాణ పనులు నిలిపివేశారని స్థానికులు అంటున్నారు. స్థానిక పోలీసుల తీరుతో చట్టం ఉన్నోడికి చట్టమయినదంటూ గిరిజనుల ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పంధించి రియల్ మాఫియా నుండి కాపాడాలని సింధుప్రియ, బి. పద్మ, ముకేష్, బి. శారద, జి. భారతి, రాణి, కళావతి, జమున, దుర్గాభవానిలు కోరుచున్నారు.

మా దృష్టికి రాలేదు : ఈ విషయంపై ఎస్‌హెచ్‌ఓ నాగరాజును ఫోన్ ద్వారా వివరణ కోరగా నేను 28వ, తేదీన సెలవులో వున్నట్లు తెలిపారు. విషయం ఇంకా నా దృష్టికి రాలేదని చెప్పారు.

స్మశానవాటికకు దారేది..?

-అశ్వాపురం ఎస్సీ కాలనీ వాసుల ఆవేదన

ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలోని అశ్వాపురంలో ఎస్సీ కాలనీ వాసులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న స్మశాన వాటిక దారి సమస్య మళ్లీ వెలుగులోకి వచ్చింది. ఎన్నో ఏళ్లుగా తహసీల్దారులు, రెవెన్యూ అధికారులు వచ్చి వినతి పత్రాలు స్వీకరించి వెళ్లిపోతున్నారే గానీ, స్థిరమైన పరిష్కారం మాత్రం కనిపించడం లేదని కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం మరొకసారి కొత్తగా వచ్చిన తహసీల్దార్ ఐఏఎస్ ట్రైనీ సౌరబ్ శర్మకు ఎస్సీ కాలనీ వాసుల ఇసంప్తి కృష్ణ, గద్దల రామకృష్ణ, కొమ్ము రాంబాబులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అశ్వాపురం గొంది గూడెం ప్రధాన రహదారిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మూలమలుపు నుండి చింతలచెరువు పక్కన ఉన్న స్మశాన వాటికకు వెళ్లే దారి రెవెన్యూ రికార్డుల్లో ఉందని, కానీ ప్రాక్టికల్‌గా దారి అందుబాటులో లేదని తెలిపారు. అధికారులను అడిగితే సర్వేలు రీసర్వేలు చేస్తున్నామని అనే సమాధానం తప్ప, నేలమీద మార్పు ఏమీ లేదని వారు విమర్శించారు. దశాబ్దాలుగా దారి లేక ఇళ్ల మధ్యలో నుంచే మృతదేహాలను తీసుకెళ్లాల్సి వస్తోందని, కొన్ని సందర్భాల్లో అడ్డంకులు ఎదురైనట్టు వాపోయారు. ఎన్నికల సమయంలో హామీలు ఇస్తారు, కానీ సమస్య పరిష్కారం మాత్రం కనిపించదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించిన స్మశాన వాటికకు స్పష్టమైన దారి చూపాలని స్థానిక ప్రజల కోరుతున్నారు. వ్యక్తి చనిపోతే అంత్యక్రియలు నిర్వహించే దారికి సంబంధించిన అంశమని కానీ ఈ దారి చూడంలో కూడా అగ్రకులాలను ఒకలాగా ఎస్సీ, ఎస్టీలను ఒకలాగా చూస్తున్నారని అధికారుల మీద ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఈ స్మశాన వాటికకు దారి చూసే అంశంలో కుల వివక్ష ఆరోపణలు కూడా వినిపిస్తున్న నేపథ్యంలో, అధికారులు తక్షణమే స్థలాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు అశ్వాపురం రాజకీయ నాయకులు కోరుతున్నారు.

కొయ్యల కుటుంబ వేడుకకు హాజరైన మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత

ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని తాళ్ళగొమ్మూరు గ్రామంలో కొయ్యల కుటుంబంలో నిర్వహించి ఓణీల అలంకరణ, పంచెకట్టు వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్ కొయ్యల పుల్లారావు, రమ దంపతుల కుమార్తె లాస్యశ్రీ ఓణీ అలంకరణ వేడుక, కుమారుడు రిషి పంచెకట్టు కార్యక్రమం బంధు మిత్రుల సమక్షంలో సంప్రదాయరీతిలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత హాజరై చిన్నారులకు అక్షితలు వేసి ఆశీర్వదించారు. పిల్లలు విద్యలో, జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇరవెండి మాజీ సర్పంచ్ కోర్స లక్ష్మి, స్థానిక వార్డు మెంబర్ చల్లకోటి జ్యోతి, పూర్ణచందర్ దంపతులు, సారపాక టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీను, టౌన్ యూత్ అధ్యక్షులు సోము లక్ష్మి చైతన్యరెడ్డి, నరేష్, అశోక్, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుల సంస్కరణ దినోత్సవం

ప్రజాపక్షం/కారేపల్లి : సింగరేణి గ్రామంలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్కరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఆర్‌పిఎస్ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు పూలమాలలు సమర్పించి, రెండు నిమిషాల మౌనం పాటిస్తూ ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఆర్‌పిఎస్ గ్రామ శాఖ అధ్యక్షలు ఆదేర్ల రామారావు, వార్డు మెంబర్, కుల పెద్ద మనిషి ఆదేర్ల అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు కాప ప్రసాద్ మాదిగ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు వృథాకావు, వారి ఆశయ సాధన కోసం ఎంఆర్‌పిఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు నాగేందర్ హాజరై అమరవీరుల సేవలను స్మరించారు. ఈసందర్భంగా ఆదేర్ల శంకరావ్ అమరుల త్యాగాలను స్మరిస్తూ ఒక భావోద్వేగభరిత గీతాన్ని ఆలపించి అందరినీ కదిలించారు. ఈకార్యక్రమంలో గజ్జల శ్రీనివాసరావు, ఆదేర్ల ఉపేందర్, కేశగాని బాలకృష్ణ, చింతల శ్రీను, చీకుర్తి అంజయ్య, ఇల్లందుల సాంబ, ఆదేర్ల వీరస్వామి, మహిళ నాయకురాలు ఆదేర్ల అరుణ, చీకుర్తి గురమ్మ, ఉమా, గౌరీ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనల ఫలితమే రోడ్డు మరమ్మతులు

ప్రజాపక్షం/మణుగూరుః మణుగూరు నుండి బయ్యారం క్రాస్ రోడ్డు వరకు రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని, దుమ్ము నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలను కలుపుకొని నిర్వహించిన ఆందోళనలు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరటం ఫలితంగానే రోడ్డు మరమ్మతులు ప్రారంభమయ్యాయని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి తెలిపారు. రోడ్డు మరమ్మత్తులు ప్రారంభం కావడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ రోడ్డు మరమ్మత్తుల వలన దుమ్ము, ధూళి నుండి ప్రజలకు కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ని కలిసి విన్నవించగా వెంటనే స్పందించి ఈ రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించి, మరమ్మతులు మొదలు పెట్టించినందుకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

మణుగూరు భవిష్యత్తు.. బొగ్గుతోనే ముడిపడి ఉంది...

ప్రజాపక్షం/మణుగూరుః బొగ్గు వేలం పాటలో సింగరేణికే దక్కితే మణుగూరు భవిష్యత్తు మరో 20 సంవత్సరాల వరకు కొదవలేదు. మల్లెపల్లి ఓసి అన్ని అనుమతులు లభిస్తే అక్కడి భూములను రైతులు స్వచ్ఛందంగా మణుగూరు అభివృద్ధి చెందాలని కోరుకుంటే దాని జీవితకాలం కూడా దశాబ్దంపై ఆధారపడే ఉంటుంది. అక్కడి భూ సమస్యలు ఎక్కువై కొంత ఆలస్యం అవ్వడానికి కారణాలు అవుతున్నాయి. ఇక ప్రత్యమయం ఒక్కటే జియోధర్మల్ విద్యుత్ కేంద్రంపై పగిడేరుపై పరుగులు పెడుతూ కొత్త ఆలోచనల దృష్టితో సింగరేణి నూతనంగా జియోధర్మల్ విద్యుత్ పై దృష్టిని పెడితేనే భవిష్యత్తులో మణుగూరుకు మంచి రోజులొస్తాయి మనుగడ ముందుకు సాగుతాయి. దీనిపై సింగరేణి నూతన మేనేజింగ్ డైరెక్టర్ ఆరా తీసినట్లు విశ్వాసనీయ సమాచారం. ఏది ఏమైనా 100 సంవత్సరాల తరగని బొగ్గుతో ముందుకు సాగే మణుగూరు సరళీకృత ఆర్థిక విధానాలతో గోబ్లైజేషన్ పోటీ తత్వంతో 100 సంవత్సరాల చరిత్రను 50 సంవత్సరాలకు బొగ్గు కొరకు అన్వేషణ మొదలు కావడం చిత్రం చిత్రంగానే మణుగూరు బొగ్గు కొరత నిలుస్తుంది.

ఎలాంటి లోటుపాట్లు లేకుండా శ్రీరామ నవమి ఏర్పాట్లు చేయాలి

- సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/భద్రాచలం : దక్షిణ అయోధ్యా భాసిల్లుతున్న శ్రీ సీతా రామ చంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరామ నవమి, పట్టాభిషేక మహోత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు దొర్లకుండా భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ,గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సబ్ కలెక్టర్ సమావేశ మందిరంలో రామ వనమి,పట్టాభిషేక మహోత్సవాలపై అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాముల వారి కళ్యాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇతర ప్రముఖులు రానున్నారని, జిల్లా యంత్రాంగం వారికి అప్పగించిన బాధ్యతలను సంపూర్ణంగా నిర్వర్తించాలన్నారు. వివిఐపి,విఐపి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తెలత్తకుండా చూడాలని, మర్యాదగా నడుచుకోవాలన్నారు. రాముల వారి కళ్యాణం ఈనెల 27న ఉ.10.30 గం.ల నుండి మ.12.30 గం.లకు జరుగుతుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం స్వామివారి టిక్కెట్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. తలంబ్రాలు, ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర సేవల కోసం 50 బెడ్లు సిద్ధం చేయాలన్నారు. పర్ణశాలతో కలుపుకుని మొత్తం 13 మెడికల్ క్యాపులు నిర్వహించాలని, అందుకు సంబంధించి మెడికల్ ఆఫీసర్లు మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. వేసవి కారణంగా భక్తులకు మంచినీరు, మజ్జిగను అందుబాటులో ఉంచాలని, పార్కింగ్ ప్రదేశాలను సిద్ధ ం చేసి అక్కడ కూడా సదుపాయాలు కల్పించాలని సూచించారు. గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇతర ప్రాంతాల నుండి పెద్దెత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆహారపదార్థాలు కల్తీ కాకుండా చూడటంతో పాటు నాణ్యతతో అందించేలా ఫుడ్ అన్స్‌పెక్టర్లు తనిఖీలు చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు అధికారులు సమన్వయంతో చేసి ఉత్సవాలు విజయవంతం అయ్యేందుకు పాటువడాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపి పోరిక బలరామ్ నాయక్, ఎంఎల్‌సి డా.తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిడ్, సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, ఎస్‌పి రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల రావు, ఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, దేవస్థానం ఇఓ దామోదర్ రావు, సర్పంచ్ పూణెం కృష్ణ దొర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్యం, చికెన్ షాపులతో ప్రజలకు ఇబ్బందులు

-పట్టించుకోని ఆలయ, గ్రామ పంచాయతీ అధికారులు

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభూ జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ సమీపంలో మద్యం, చికెన్ షాపుల ఏర్పాటుతో ప్రజలు, భక్తులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం దేవాలయాలు, పాఠశాలలు, బ్యాంకులకు 500 మీటర్ల దూరంలో మద్యం, చికెన్ దాబాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది కానీ జమలాపురం గ్రామంలో ఎంతో చరిత్ర ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, పద్మావతి ఆలయం చుట్టూ ప్రాంతాలలో మద్యం షాపులు, చికెన్ షాపులు, దాబాల ఏర్పాటుతో సామాన్య ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రుపాలెం నుండి జమలాపురం గ్రామంలో వచ్చే ఆర్‌అండ్‌బి రోడ్డు పద్మావతి ఆలయం ఎన్‌టిఆర్ సర్కిల్ నుండి వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు రెండు వైపులా రోడ్డును మార్జిన్ కూడా లేకుండా కొందరు ఆక్రమణ చేసి వ్యాపారాలు చేస్తున్నా గ్రామ పంచాయతీ అధికారులు కానీ సంబంధిత శాఖాధికారులు కానీ దీనిపై తగు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం, పద్మావతి దేవి ఆలయం చుట్టు పక్కల ఎటు చూసినా మద్యం, చికెన్ షాపులే దర్శనమిస్తున్నాయి. ఆలయ అధికారులు దీనిపై తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చికెన్ షాపుల వ్యక్తులు వ్యర్థాలను ఆరుబయట వదిలి వేయడంతో వాటిని కుక్కలు తిని వింత వ్యాధి సోకి గ్రామ వీధుల్లో తిరుగుతూ ఉంటే ప్రజలు భయంతో వణికిపోతున్నారు. సివిల్ సప్లయ్ శాఖ అధికారులు జమలాపురం గ్రామాన్ని సందర్శించి ప్రజలకు ఉన్న ఇబ్బందులను తొలగించడానికి కృషి చేయాలని గ్రామ పంచాయతీ పాలక మండలి వారు కూడా దీనిపై స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సర్పంచ్ నిర్మలకుమారి వివరణ :

జమలాపురం గ్రామంలో పద్మావతి ఆలయం నుండి స్వామివారి ఆలయ ప్రాంగణం వరకు రోడ్డుకు ఇరువైపులా చికెన్, మద్యం షాపులు ఏర్పాటు చేసి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని తమ దృష్టికి ప్రజలు తీసుకు వచ్చారని దీనిపై సంబంధిత అధికారులతో కలిసి తగు చర్యలు చేపడతామన్నారు.

ఆలయ ఈవో వివరణ :

దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రకారం ఆలయాలు, పాఠశాలల సమీపంలో మద్యం, చికెన్ షాపులు, దాబాలు ఏర్పాటు చేయకూడదని ఆదేశాలు ఉన్నాయని దీనిని ఎవరైనా అతిక్రమించి అలా షాపులు ఏర్పాటు చేస్తే వారిపై శాఖపరమైన తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

66వ బిపి, షుగర్ ప్రత్యేక క్యాంపు విజయవంతం

-సరైన ఆహారం, జీవనశైలి మార్పులే కీలకమైనవి
-బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ వైద్య క్యాంపులను సద్వినియోగించుకోండి

ప్రజాపక్షం/బోనకల్: మండల కేంద్రంలోని రైతువేదిక ప్రాంగణంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతి నెల మొదటి ఆదివారం నిర్వహించే బిపి, షుగర్ 66వ క్యాంపు విజయవంతమైంది. క్యాంపు వైద్యులు మాట్లాడుతూ బిపి, షుగర్ అనేవి ప్రస్తుత కాలంలో చాలా సాధారణ ఆరోగ్య సమస్యలుగా మారిపోయాయని అన్నారు. వీటిని సకాలంలో గుర్తించి నియంత్రించుకోవడం ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడానికి ఎంతో ముఖ్యమని తెలిపారు. సరైన ఆహారం, జీవనశైలి, నెలనెల వైద్యపరీక్షలు, మందులు వాడకంతోని బిపి, షుగర్‌లను ఆదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. సాధారణంగా ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు, అంటే ఎలాంటి లక్షణాలు లేని వారు, కనీసం సంవత్సరానికి ఒకసారి బిపి, షుగర్ పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచించారు. అయితే కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్యలు ఉన్నా లేదా మీ వయస్సు 30 ఏళ్లు దాటినా ప్రతి ఆరు నెలలకు ఒకసారి చెక్ చేయించుకోవడం ఉత్తమమైన పద్ధతి అని అన్నారు. క్యాంపులో 100 మందికి వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించగా, క్యాంపు సహాయకులు నెలకు సరిపడ నాణ్యమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆర్ఎంపిడబ్ల్యూఏ టిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, క్యాంపు వైద్యులు ఎస్ లావణ్య, ఎస్ సాదానందం, క్యాంపు సహాయకులు యంగల గిరి, బొమ్మ సతీష్‌కుమార్, గోపి, దుగ్గి భద్రయ్య, గొల్లపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తాండ్ర లక్ష్మీనారాయణ మృతి తీరనిలోటు

ప్రజాపక్షం/ కొత్తగూడెం : ఇల్లెందు మాజీ వైఎస్ ఎంపిపి తాండ్ర లక్ష్మీనారాయణ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు అన్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మీనారాయణ హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ మృతి చెందగా మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఆదివారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతో కలిసి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపిపి తాండ్ర లక్ష్మీ నారాయణ మంచి ప్రజా సేవకుడని, చివరి వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కడదాకా ఎర్రజెండాతోనే ఉన్నారని చెప్పారు. ఆయన ప్రజలకు సేవ చేసేందుకు అనుక్షణం తపించేవారని తెలిపారు. లక్ష్మీ నారాయణ లేని లోటు పేద ప్రజలకు లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర, బంధం నాగయ్య, పట్టణ మండల కార్యదర్శులు బాస శ్రీనివాసరావు, బొప్పిశెట్టి సత్యనారాయణ, ఉప సర్పంచ్ ఖాసీం, ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, సిపిఐ నాయకులు గుగులోత్ కృష్ణ, మంచాల వెంకటేశ్వర్లు, ఆలం రాఘవేంద్రరావు, ఉదుత ఐలయ్య పాల్గొన్నారు.

భూదాన్ బాధితుల ఆందోళన

-పలువురి అరెస్టు - లాఠీఛార్జ్

ప్రజాపక్షం / ఖమ్మం : వెలుగుమట్ల బాధితులు ఆదివారం పునరావాస కేంద్రాల వద్ద ఆందోళనకు దిగారు తమకు పునరావాస కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించ లేదని, తమకు వెలుగుమట్ల ప్రాంతంలోనే నివాస స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ వైరా రోడ్డుపై టిటిడిసి సమీపంలో ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇండ్లు కోల్పోయిన పేదలకు టిటిడిసి, అంబేద్కర్ భవన్‌లో పునరావాసం కల్పించారు. ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన రాకేష్‌దత్తా, రాజు తదితరులు బాధితులను పరామర్శించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో చేపట్టడంతో పోలీసులు వారిని అక్కడి నుంచి బయటకు పంపేందుకు ప్రయత్నించే క్రమంలో తోపులాట జరిగింది. పోలీసులు లాఠీలను ఝుళిపించారు. కొందరు మహిళలు ఈ ఘటనలో గాయపడ్డారు. రోడ్డుపై నుంచి వారిని తొలగించి ఆందోళనను విరమింపజేశారు. ఈ సందర్భంగా రాకేష్‌దత్తా, రాజు సహా పలువురిని అరెస్టు చేసి నగరంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వెలుగుమట్ల నిర్వాసితులకు అండగా ఉంటాం

-న్యాయపోరాటానికి సిద్ధం : పువ్వాడ అజయ్‌కుమార్

ప్రజాపక్షం/ ఖమ్మం : వెలుగుమట్ల భూదాన్ భూముల్లో నివాసాలను కోల్పోయిన బాధితులకు బిఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు కెటిఆర్ ఇచ్చిన హామీ మేరకు న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నామని ఆయన తెలిపారు. ఆదివారం బిఆర్ఎస్ నాయకులు బాధితులతో హైదరాబాద్‌లో ప్రత్యేకంగా అజయ్‌కుమార్ సమావేశమై న్యాయ పోరాటానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. హైకోర్టులో పిటిషన్ వేసి పోరాడతామని ఆయన బాధితులకు భరోసా ఇచ్చారు. అధైర్య పడవద్దని బిఆర్ఎస్ అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, అడ్వకేట్ మేకల సుగుణారావు, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, భూ బాధితులు వీరన్న, సంపంగి వెంకటేశ్వర్లు, వెంకటాచలం, శ్రీను, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే కూల్చివేతలు

-బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు

ప్రజాపక్షం/ఖమ్మం : రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే వెలుగుమట్లలో పేదల ఇండ్లను ప్రభుత్వం కూల్చివేసిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆరోపించారు. ఆదివారం వెలుగు మట్ల భూదాన్ భూముల్లో పేదల నివాసాలను కూల్చిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమే పేదల నివాసాలను తొలగించారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానం ఆదేశాలను ఖాతరు చేయకుండా పేదలను వీధినపడేసిందన్నారు. బాధితులకు అక్కడే నివాస స్థలాలను కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అధికార వర్గాలకు అత్యంత సన్నిహితులైన స్థిరాస్తి వ్యాపారుల కోసం పేదల గుడిసెలను కూల్చివేశారని, న్యాయస్థానం యథాతథస్థితిని కొనసాగించాలని తీర్పు చెప్పిన అధికారులు పట్టించుకోలేదన్నారు. విద్యార్థులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న పేదలను ఆయన పరామర్శించి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు దేవకి వాసుదేవరావు, మైపాల్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శారద, గల్లా సత్యనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడే బ్రహ్మాండనాయకుని తిరు కళ్యాణ మహోత్సవం

-బ్రహ్మోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైన శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయం
-భక్తులను ఆహ్వానిస్తున్న ఆలయ నిర్వాహకులు

ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నటువంటి 18వ శతాబ్దము కాలము నాటి అతి పురాతమైన చరిత్ర కలిగిన కాకతీయ రాజుల శిల్పకళా వైభవంతో నిర్మించబడినటువంటి దేవాలయము నందు కొలువై ఉన్న భక్తుల కొంగుబంగారమై, సంతాన బాలాజీగా పూజలందుకుంటున్న శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని తిరుకళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగ రంగ వైభవంగా నేడు జరుగుతుంది. ఈ కళ్యాణ వేడుకకు ఆలయ ప్రాంగణం మొత్తం సర్వాంగసుందరంగా విద్యుత్ దీపాలంకరణలతో సుగంధ పరిమళ పలమాలలతో ఎంతో మనోహరంగా సిద్ధమైంది. ఈ బ్రహ్మోత్సవములు స్వస్తి శ్రీ చాంద్రమానేన శ్రీ విశ్వావసు నామ సంవత్సర పాల్గుణ శుద్ధ ద్వాదశి శనివారం 28 ఫిబ్రవరి 2026 నుండి ప్రారంభమై పాల్గొన్న బహుళ విధియ గురువారం 05 మార్చి 2026వ రకు వేద పురాణాది పారాయణ దులతో శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. సోమవారం సాయంకాలం ఐదు గంటల నుండి 10గంటల వరకు ఆరాధన, చతుస్థానార్చన, నిత్య హవనము, పూర్ణాహుతి, బలిహరణము, గజ వామన సేవ, పల్లికి సేవ, ఎదుర్కోల ఉత్సవము నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపము నందు ప్రధాన అర్చకులు ప్రసాద ఆచార్యులు ఆధ్వర్యంలో ఆగమన పండితుల యజ్ఞాచార్యులు ప్రతాపురం గిరిధరాచార్యులు సారథ్యంలో స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడుతుంది. కనుక ప్రజలందరూ కూడా బ్రహ్మాండనాయకుని కళ్యాణ మహోత్సవమును కన్నులారా దర్శించుటకు విచ్చేసి స్వామి వారి ఆశీస్సులు పొందగలరని, బ్రహ్మోత్సవాలు జరిగే ఈ ఐదు రోజులు కూడా సాయంకాల సమయంలో భక్తిపరమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఆలయ మేనేజర్ వెంకటరమణ తెలిపారు. అన్నపురెడ్డిపల్లి పరిసర ప్రాంతాల నుండి కొత్తగూడెం, సత్తుపల్లి ఆర్టీసీ బస్ డిపో నుండి బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏ విధంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మంచి నీరు. అన్నదానం కార్యక్రమాలు ఆరోగ్యపరమైన ఇబ్బందులు కలుగకుండా వైద్య ఆరోగ్య శాఖ వారి ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వామి వారి ప్రసాదాలను ప్రత్యేక కౌంటర్లలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ, రెవిన్యూ శాఖ, శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయ దేవాలయ ధర్మాదాయ శాఖ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ చేస్తారని, ప్రజలందరూ కూడా ఈ విషయాలను గమనించి స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో హాజరై ఈ జాతరను విజయవంతం చేయాలని కోరారు.

అవినీతి నిరోధక శాఖ తనిఖీతో వైరాలో ఉలిక్కిపాటు..!

-భయాందోళనలో ఆయా శాఖలు..
-ఖాళీగా దర్శనమిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు



ప్రజాపక్షం/వైరా: అవినీతి నిరోధక శాఖ తనిఖీలతో వైరాలో ఉలిక్కిపాటు, రెండు రోజుల క్రితం వైరా మత్స్యశాఖ కార్యాలయం నందు అవినీతి నిరోధక శాఖ అధికారులు డిఎస్పి వై.రమేష్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. మత్స్యశాఖలో ఏసిబి అధికారులు ఉన్నారని విషయం తెలియగానే వైరాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు కార్యాలయాలను వదిలి బయటికి వెళ్లిన విషయం ఇప్పుడు వైరాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఎక్కడో తనిఖీలు జరుగుతుంటే మిగతా కార్యాలయాల్లో కొంతమంది సిబ్బంది ఎందుకు బయటకు పోవాల్సి వచ్చింది. ఏసిబి పేరు చెప్తేనే ఎందుకు భయపడుతున్నారు. ఏసిబి అధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లో పని సక్రమంగా లేకపోయినా విధినిర్వహణ సక్రమంగా లేకపోయినా అవినీతి అధికారులతో పాటు వీటిపై కూడా మాకు సమాచారం ఇవ్వాలని మీడియా ముఖంగా చెప్పిన మాటలతో మరింత ఉలిక్కిపాటు ప్రారంభమైంది. కొందరు అధికారులు వారి అవినీతి ఎక్కడ బయటపడుతుందో అని ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పుడు అవినీతి నిరోధక శాఖ పేరు చెబితేనే వారిలో వణుకు పుడుతుంది. మరి అలాంటి భయమున్న అధికారులు ఎందుకు బాధ్యతాయుతంగా పనులు నిర్వహించడం లేదు, మీరు తప్పుడు మార్గంలో ఉన్నారు. కాబట్టే అవినీతి నిరోధక శాఖ పేరు చెబితేనే భయపడాల్సి వస్తుంది. ప్రజల్లో కూడా అవినీతి నిరోధకశాఖ అధికారులు అవగాహన కల్పించడం కూడా ఇప్పుడు పైసలు తడపందే పనిచేయని అధికారుల్లో వణుకు పుడుతుంది. అధికారులు అవినీతి పాల్పడుతుంటే సంప్రదించాలని అవినీతి నిరోధక శాఖ 1064 టోల్‌ఫ్రీ నెంబర్ ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా కొంతమంది అధికారులు విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా ఉన్న మాట వైరాలో చాలా ఆఫీసుల్లో కనపడుతూ ఉంది. సమయపాలన పాటించకుండా కూడా ఇష్టానుసారంగా వచ్చే అధికారులు సైతం ఉన్నారు. ఇలాంటి అధికారులకు ఇప్పుడు ఏసిబి అధికారుల మాటలు తూటాలుగా పేలడంతో భయాందోళనలో ఉన్నారని చెప్పవచ్చును. ఏది ఏమైనప్పటికీ అవినీతి నిరోధక శాఖ తనిఖీల్లో ఒక్కసారిగా వైరాలో కొంతమంది అధికారుల్లో వణుకు పుట్టిందని చెప్పవచ్చును.

మిమ్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాపక్షం/అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగులో మిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. మల్లెలమడుగు సర్పంచ్ మచ్చ నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ ఉచిత మెగా శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ మోహన్‌రావు పాల్గొని వైద్య సేవలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సాయం అందించాలనే ఉద్దేశంతోనే ఇలాంటి క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఒక్కరు క్యాంపులను ఉపయోగించుకోవాలని అన్నారు. అనంతరం క్యాంపుకు అధ్యక్షత వహించిన సర్పంచ్ మచ్చ నరసింహారావు మాట్లాడుతూ పేదల పట్ల మిమ్స్ యాజమాన్యం సేవా దృక్పథం మిమ్స్ యాజమాన్యం పేద, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటోందని, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ఆరోగ్య సేవలను ప్రజల దగ్గరికి తీసుకెళ్లడం వారి సేవాభావానికి నిదర్శనమని అన్నారు. ఈ శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలు, రక్త పోటు, షుగర్ పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మొండికుంట ఉప సర్పంచ్ శివారెడ్డి, రిటైర్డ్ ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ కాసరబాద శ్రీనివాస్, ఆవుల రవి, రాగం మల్లయ్య, బచ్చు వెంకటరమణ, మానాది వెంకన్న, రోగులు, మల్లెలమడుగు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉత్సాహపూరితంగా మహిళా ఉద్యోగుల క్రీడలు

ప్రజాపక్షం / ఖమ్మం : తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు ఆదివారం క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో క్రీడా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, బుల్లెట్ శ్రీను, రుక్మారావు, జి. బిక్కు, ఓదేలు, జానిమియా తదితరులు పాల్గొన్నారు.

15 ఏళ్ల కోతుల సమస్యకు పరిష్కారం..!

200 కోతులను పట్టించిన సర్పంచ్ సుజాత

ప్రజాపక్షం/నేలకొండపల్లి : గత 15 ఏళ్ల నుంచి కోతుల తో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య కు ప్రస్తుత సర్పంచ్ కోతుల ను పట్టించి సమస్య కు పరిష్కారం చూపారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని సుర్దేపల్లి లో కోతుల వలన మొక్కజొన్న, చెరుకు ఇతర పంటలను ధ్వంసం చేయటం, ఇళ్లలో మామిడి చెట్ల తో పాటు ఇతర తినే పండ్లను తెంపి వేయటం, ఇళ్లలో చోరబడి అన్నం కోసం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రజల ఇబ్బందులను గమనించిన సర్పంచ్ గరిడేపల్లి సుజాత ఆదివారం కోతుల ను పట్టించారు. ఏపీ లోని తిరుపతి కి చెందిన కోతుల పట్టే ప్రత్యేక బృందం కోతుల వేట ను . సాగించారు. ప్రత్యేకంగా చేయించిన బోను లో కోతుల ను పట్టారు. మొత్తం 200 కోతుల ను పట్టించి, ఇల్లందు అటవీ ప్రాంతం కుతరలించారు. గ్రామంలో కోతుల సమస్య లేకుండా పరిష్కారం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు 15 ఏళ్ల పడుతున్న ఇబ్బంది ని పరిష్కారం చేసిన సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గరిడేపల్లి రామారావు తో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాపక్షం/అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నిరుపేద కుటుంబానికి గ్రామ యువత ఆదర్శంగా నిలిచింది. గ్రామానికి చెందిన సున్నం బాలరాజు కుమారుడు సున్నం జయంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో దశదిన కర్మల నిర్వహణకు అవసరమైన ఖర్చులను భరించలేని పరిస్థితిలో ఉన్న కుటుంబానికి తోడుగా నిలవాలని మొండికుంట గ్రామ రాజీవ్ స్ట్రీట్ యువత ముందుకొచ్చింది. తమ వంతుగా ఆర్థిక సాయం అందించి, కుటుంబానికి ధైర్యం చెప్పి మానవతా భావాన్ని చాటుకుంది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు యువత చేసిన సహాయాన్ని అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శమని అన్నారు. ఈకార్యక్రమంలో యువత గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల ఆదాయ వనరులివే..

-ప్రత్యేక నిధులతో మున్సిపాలిటీల అభివృద్ధి
-నూతన పాలకమండలికి సదావకాశం

ప్రజాపక్షం/వైరాః మున్సిపాలిటీలోని ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు కల్పించేందుకు మున్సిపాలిటీలు పలు మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుంటాయి. వాటితో అభివృద్ధికి పెద్ద పీఠ వేస్తాయి. అలా వచ్చిన ఆదాయ వనరులతో ముందుకు పోతాయి. మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పలు రకాల నిధులు సమకూరుతాయి. ఆ నిధులతో నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీల పాలకవర్గాలు అభివృద్ధి చేసుకునే విధంగా వీలుంటుంది.

నీటి పన్ను : మున్సిపాలిటీలో గృహాలకు వ్యాపార సముదాయాలకు విద్యాసంస్థలకు త్రాగునీటి సరఫరాతో పాటు నల్లా కనెక్షన్లకు సంబంధించిన పన్ను వసూలు చేస్తారు.

ఆస్తి పన్ను : ఇది మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరు, ఇళ్లు, వాణిజ్య సముదాయాలు, ఖాళీ స్థలాలపై అధికారులు ఆస్తి పన్ను విధిస్తారు.

లైసెన్స్ ఫీజులు : వ్యాపార దుకాణాల లైసెన్సులు, హోటళ్ళు, సినిమా థియేటర్ల అనుమతులకు యజమానుల నుంచి కొంత రుసుం వసూలు చేస్తారు.

భవన నిర్మాణ అనుమతులు : కొత్తగా ఇళ్లు నిర్మించడం లేదా భవనాల ప్లాన్‌ల ఆమోదానికి వేసే పన్ను.

మార్కెట్ అద్దె : మున్సిపాలిటీ ఆధ్వర్యంలోని ఉన్న దుకాణ సముదాయాలు, సంతలు, మాంసపు దుకాణాల ద్వారా అద్దెల రూపంలో ఆదాయం అందుతుంది.

జరిమానాలు : మున్సిపాలిటీ నిబంధనల ఉల్లంఘన, పరిశుభ్రత పాటించని హోటల్స్, రెస్టారెంట్స్, స్థలాల ఆక్రమణకు పాల్పడిన వారికి జరిమానాలు వేస్తారు.

వినోదపు పన్ను : మున్సిపాలిటీల్లో సినిమా టికెట్లు, ఇతర వినోద కార్యక్రమాల పన్నుల ద్వారా సమకూరే ఆదాయంలో మున్సిపాలిటీకి ఆదాయంకి వాటా ఉంటుంది.

హోర్డింగ్ ప్రకటనలు : మున్సిపాలిటీల్లో విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల హోర్డింగ్‌లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తుంటారు. వాటి నుంచి దాయాన్ని పన్ను రూపంలో మున్సిపాలిటీకి చెందుతుంది. ప్రతి సంవత్సరం పెద్ద పెద్ద హోర్డింగ్‌లను ఏర్పాటు చేసి వాటిలో ప్రకటనలు చేస్తూ ఉంటారు. ఆ ప్రకటన చేసే ముందు ప్రకటనలకు ఇంత అని కొలతలు ద్వారా ఆదాయాన్ని మున్సిపాలిటీకి పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

స్టేట్ ఫైనాన్స్ నిధులు : జనాభా సంఖ్యను బట్టి మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం స్టేట్ ఫైనాన్స్ నిదులను విడుదల చేస్తుంది. టిఎస్‌పి(తెలంగాణ స్టేట్ ఫైనాన్స్) పేరిట డబ్బులు విడుదల చేస్తుంది. వాటిని పారిశుద్ధ్యానికి, వివిధ రకాల పరికరాలను కొనుగోలు చేయడానికి ఖర్చు చేస్తారు. కౌన్సిల్ సమావేశంలో సభ్యులు తీర్మానం చేసిన తర్వాత ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఏఎస్పీ(అడిషనల్ స్టేట్ ఫైనాన్స్) పేరుతో వచ్చే డబ్బులతో వార్డువలో అభివృద్ధి పనులు చేయడానికి అవకాశం ఉంటుంది.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు : మున్సిపాలిటీల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ వార్డుల్లో సిసి రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాల వంటి అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేస్తుంది. వాటిని ఆ వర్గానికి చెందిన వార్డుల్లో మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది.

14వ ఆర్థిక సంఘం నిధులు : కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు విడతలుగా జనాభా సంఖ్యను బట్టి మున్సిపాలిటీలకు 14వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తుంది. ఇవి ఏప్రిల్ మొదటి వారంలో డిసెంబర్ చివరిలో నేరుగా మున్సిపాలిటీల ఖాతాలో జమ అవుతాయి. వాటితో మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో సిసి రోడల నిర్మాణాలకు అవకాశం ఉంటుంది.

ప్లానింగ్, నాన్ ప్లానింగ్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపాలిటీల అభివృద్ధికి వివిధ రకాల కార్యక్రమాలు అమలు చేస్తాయి. ముఖ్యంగా స్వచ్ఛ భారత్, పట్టణ ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతం చేసి వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి వీటిని వినియోగిస్తారు.

కార్మికులకు ఇబ్బందులు తెస్తున్న పాలకుల విధానాలు

-ఏఐటియుసి సమావేశంలో శింగు

ప్రజాపక్షం / ఖమ్మం : పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తొలగించి పాలకులు కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు తెలిపారు. కార్మిక చట్టాల రద్దు, లేబర్ కోడ్స్ కారణంగా శ్రమ దోపిడీ పెరగడంతో పాటు పని భద్రత కరువైందన్నారు. ఏఐటియుసి జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ అధ్యక్షతన సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో శింగు నర్సింహారావు మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల కారణంగా సమ్మె హక్కును, సంఘాన్ని స్థాపించే హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే కనీసం న్యాయస్థానానికి వెళ్లే అవకాశం లేకుండా లేబర్ కోడ్‌లను రూపొందించారని ఆయన తెలిపారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానానికి స్వస్తి పలికి 10 గంటల పని విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. అవుటోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి. రామాంజనేయులు, ఏఐటియుసి నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, పిట్టల మల్లయ్య, జాకీరుద్దీన్, పేరబోయిన మోహన్‌రావు, వీరునాయక్ పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుడు అరెస్ట్

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : ఆన్‌లైన్‌లో జాబ్, షేర్‌మార్కెట్, ట్రేడింగ్‌లో ఇన్‌వెస్ట్‌మెంట్ గా డబ్బు లు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి సుమారు 47లక్షల రూపాయలు మోసం చేసిన సైబర్ నేరస్తుడిని సైబర్ క్రైం పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివరాలిలా ఉన్నాయి..హైదరాబాద్ టిజిసిఎస్‌బి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అపరేషన్ క్రాస్‌డౌన్ 1.0లో భాగంగా ఖమ్మం జిల్లాకు చెందిన భాదితుడికి వాట్సప్, టెలిగ్రామ్‌లో పరిచయమై ఆన్‌లైన్‌లో జాబ్, షేర్‌మార్కెట్, ట్రేడింగ్‌లో ఇన్‌వెస్ట్‌మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని పలు కేసుల్లో నిందితుడుగా ఉన్న అకౌంట్ హోల్డర్ హైదరాబాద్‌కు చెందిన ఎండి ఫిరోజ్ ను అక్కడి సిటి పోలీసుల సహకారంతో అరెస్ట్ చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సిపి తెలిపారు. ఈ కేసు విచారణలో ప్రధానపాత్ర పోషించిన సైబర్‌క్రైం డిఎస్‌పి సిహెచ్ ఆర్ వి ఫణింధర్, ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్సైలు రంజిత్‌కుమార్, విజయకుమార్, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, కానిస్టేబుల్ కృష్ణప్రసాద్, స్టేషన్ సిబ్బందని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అభినందించారు.

నిర్మాణాత్మక పోలీసింగ్‌పై దృష్టి

-తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి
-పోలీసు స్పోర్ట్స్‌కాంప్లెక్స్, గృహభవనాల ప్రారంభం

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : నిర్మాణాత్మక పోలీసింగ్‌పై దృష్టిసారించాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి అన్నారు. అదివారం ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ముందుగా సాయుధ పోలీసు బలగాల నుంచి గౌరవవందనం స్వీరించారు. మల్టీజోన్ ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆయనకు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. పోలీస్‌హెడ్ క్వాటర్స్‌లో నిర్మించిన స్పోర్స్ కాంప్లెక్స్, పోలీసు వసతిగృహాల సముదాయాన్ని డిజిపి ప్రారంభించారు. సుముదాయాలను, భవనాలను కలియతిరిగి పరిశీలించారు. అత్యాధునిక సదుపాయలతో పోలీసు గృహా భవనాలను నిర్మించినట్లు ఆయన తెలిపారు. అనంతరం పోలీసు శిక్షణాకేంద్రంలో పోలీసు అధికారులతో నేరసమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తాంగా నేరగణాంకాలు, కేసుల్లో పురోగతి, శాంతిభద్రతలు, మహిళలు, శిశువుల భద్రత, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాధకద్రవ్యాలు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చేపడుతున్న చర్యలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా డిజిపి మాట్లాడుతూ తెలంగాణ పోలీసులకు దేశంలోనే మంచిగుర్తింపు ఉందన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలీస్తే నేరాల నియంత్రణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో మన పోలీసులు ముందున్నారన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, రోడ్డుప్రమాదాలు, మాదకద్రవ్యాలు సమాజం ముందున్న పెనుసవాళ్లను నియంత్రించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైబర్‌సెక్యూరిటీ బ్యూరో(టిజీసిఎస్పీ), ఈగల్ అత్యున్నతంగా పనిచేస్తున్నాయన్నారు. డ్రగ్స్ మూరాలను రాష్ట్రంలో లేకుండా చేయడంలో కీలకంగా వ్యవహరించిందన్నారు. సైబర్ నేరాలు పదేళ్లుగా గణనీయంగా పెరుగుతున్నాయని ఇది సాధారణ సమస్య కాదన్నారు. స్వీయ అవగాహనతో సైబర్ మోసాలకు కళ్లెం వేయాలన్నారు. ఇందుకు ఇంటిటికి ప్రచారం చేయటమే లక్ష్యంతో హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ రూపొందించిన 'సైబర్‌సింబా' కార్యక్రమంలో ఖమ్మం జిల్లాలో అమలు చేయాలన్నారు. ఫలితంగా సైబర్ నేరాలకు చెక్‌పెట్టవచ్చాన్నారు. ఇందుకు తగిన విధంగా ప్రణాళికతో జిల్లాపోలీసులు పనిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల విషయంలో దారుణమైన రికార్డులు నమోదుఅవుతున్నాయన్నారు. ప్రతి ఏడాది వేలసంఖ్యలో యువత మృత్యువాతపడుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన కలిగించేందుకు చేపడుతున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని మార్చి నెల చివరివరకూ నిర్వహిస్తున్నట్లు డిజిపి పేర్కొన్నారు. ఇక మాధక ద్రవ్యాల రవాణాను ఏమాత్రం సహించేదిలేదన్నారు. గంజాయి వంటి మాధకద్రవ్యాల రవాణాను కట్టడి చేసేందుకు తనిఖీలు ముమ్మరం చేస్తుంటే సదరు ముఠాసభ్యులు ప్రత్యేమ్నాయ మార్గాల్లో వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని దానిని కట్టడి చేసేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. బెసిక్ పోలీసింగ్, చట్టాలపై లోతైన అవగాన కోసం దృష్టిపెట్టాన్నారు. స్టేషన్‌లలో రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలని, పెండింగ్ కేసుల స్థితి, పురోగతి, నేర నియంత్రణకు అమలు చేస్తున్న ప్రత్యక చర్యల వివరాలు డిజిపి పోలీసు అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ప్రసాద్‌రావు, రామానుజం, కుమారస్వామి, విజయబాబు, ఏసిపిలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, సారంగపాణి, శ్రీనివాసులు, మహేష్, సర్వర్, సత్యనారాయణ, ఫణిందర్, సుశీల్‌సింగ్, నర్సయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం

ప్రజాపక్షం/అశ్వాపురం: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన మాదిగల అమరవీరుల స్మరణార్థం అశ్వాపురం ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసంపల్లి కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం కృష్ణ మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధన కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించి మూడు దశాబ్దాలుగా ఉద్యమాన్ని ముందుకు నడిపించి వర్గీకరణ సాధించిన అంశంలో వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పాత్ర కీలకమని కొనియాడారు. ఎస్సీ వర్గీకణ కోసం అమరవీరులు చేసిన త్యాగాలు వృథా కాలేదని, వారి త్యాగఫలంగానే నేడు వర్గీకరణ పొందామని అమరవీరుల ఆత్మస్ఫూర్తితోనే మాదిగ సమాజం ఐక్యంగా ముందుకు సాగుతోందని అన్నారు. ఈకార్యక్రమంలో చుంచు రామ్మూర్తి, గద్దల రామకృష్ణ, మిర్యాల బాలకృష్ణతో పాటు ఎస్సీ కాలనీ వాసులు, మహిలలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం నినాదాలతో ఉత్సాహభరితంగా ముగిసింది.